# మీరు చదివారా?

## – కృష్ణవేణి





(నెలనెలా ఓ పుస్తకం – సమగ్రపరిచయం)

## Blue Umbrella






రస్కిన్ బాండ్ (మే19, 1934) బ్రిటిష్ సంతతి, ఇండియన్ రచయిత. హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న కసౌలీలో పుట్టారు. సిమ్లాలో ఉన్న బిషప్ కాటన్ స్కూల్లో ఆయన చదువు సాగింది. ప్రస్తుతం, ముస్సోరీలో తన దత్తు కుటుంబంతో పాటు ఉంటారు. ఆయనకి 17 ఏళ్ళుండగా, 1957లో– అనాథ అయిన ఆంగ్లో ఇండియన్ టీనేజర్ గురించి రాసిన ఆయన మొట్టమొదటి నవలైన 'ద రూమ్ ఆన్ ద రూఫ్' నవలకి, 'జాన్ హవెలిన్ రీస్ మెమోరియల్ అవార్డ్' పొందారు. 'అవర్ ట్రీస్ స్టిల్ గ్రో ఇన్ డెహ్రా' అన్న కథా సంకలనానికి 1992లో సాహిత్య అకాడెమీ అవార్డ్ వచ్చింది.

బాండ్, 1999లో పద్మశ్రీ పొందారు. 2014లో పద్మభూషణ్ వచ్చింది. 'నా బాల్యం వంటరితనంతో గడిచింది కనుక పిల్లల్ని అర్థం చేసుకోవడంలో అది నాకు సహాయపడుతుంది.' అంటారు.

ఇప్పటివరకూ ఆయన– అనేకమైన నవలికలు, 500 పైగా ఉన్న కథలేకాక– కొన్ని వ్యాసాలూ, పద్యాలూ కూడా రాశారు. 'జాతి కానీ మతం కానీ నన్ను భారతీయుడిని చేయలేదు. చరిత్ర నన్ను భారతీయునిగా మార్చింది. కాలక్రమాన్న ముఖ్యమయ్యేది చరిత్రే.' అంటారు బాండ్. ఈయన రచనల ఆధారంగా కొన్ని టివి షోలు, సినిమాలూ వచ్చాయి. వాటిల్లో రెండవది 'బ్లూ అంబ్రెల్లా.' ఈయన రచనల్లో అధికశాతం తను గడిపిన హిమాలయాల కొండల నేపధ్యంతోనే ఉన్నవి.

★★★

11 ఏళ్ళ బిన్యా– అన్న బిజ్జూతో, తల్లితో కలిసి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఉండే చిన్నపల్లెలో ఉంటుంది. చిన్నప్పుడే తండ్రి మరణిస్తాడు. ఉన్న కొంత పొలంలో కాయగూరలు పండించుకుంటుంది కుటుంబం. రెండు ఆవులుంటాయి. వాటి పాలని తమకి తగినంత ఉంచుకుని మిగతాది అమ్ముకుంటారు. తమ కాళ్ళమీద తాము నిలబడ్డం తప్పితే డబ్బు సంపాదన ఉద్దేశ్యమే ఉండదు వారికి.

బిన్యాకి కొండల్లో, లోయల్లో తిరగడం ఇష్టం. చెట్లెక్కుతుంది. చీకటన్నా, అడవులన్నా భయపడదు. ఒక రోజు ఆవుల్ని ఇంటికి తోలుకొస్తుండగా,

జాపనీస్ టూరిస్టుల గుంపొకటి ఎదురవుతుంది. వాళ్ళందరూ చక్కగా మంచి బట్టలు వేసుకుని ఉంటారు. వారిలో ఒకరి వద్దనున్న నీలం రంగు కుచ్చుకుచ్చుల గొడుగు, పిల్ల దృష్టిని ఆకట్టుకొంటుంది. అది పువ్వులా, పొడి గోధుమ రంగు కొండ పక్కన విచ్చుకున్న నీలం రంగు పువ్వులా ఉంది. వాళ్ళకేమో బిన్యా మెడలో ఉన్న పులిగోరు పతకం నచ్చుతుంది. కొండ నివాసులు దాన్ని రక్షరేకు అని నమ్ముతారు. గొడుగూ, పతకం చేతులు మారుతాయి. గొడుగు ఎంతో తేలిగ్గా, అందంగా– మెరుస్తూ ఉంటుంది. అదేకాక, అది బిన్యా చేతుల్లో సరిగ్గా ఇముడుతుంది.

ఆ తరువాత పల్లెవాసులందరి సంభాషణలో బిన్యా గొడుగు గురించిన ప్రస్తావన వస్తూనే ఉంటుంది. కనీసం ఒకసారైనా దాన్ని చేతుల్లోకి తీసుకోవాలన్న ఆత్రం అందరికీ మొదలవుతుంది. బిన్నీ చిరునవ్వుతో గొడుగుని అందరి చేతికీ అందిస్తుంటుంది. గొడుగును ముయ్యడానికి ఇష్టపడదు. 'పెద్దల్లా కాక పిల్లలకు నటించే అవసరం పడదు. వాళ్ళు బాహాటంగానే గొడుగును మెచ్చుకుంటుంటారు. అలా చేస్తే, బిన్యా దాన్ని తమ చేతుల్లో పెడుతుందని వాళ్ళకి తెలుసు.

రామ్ భరోసా ఊళ్ళో ఉన్న టెహ్రీ రోడ్డుమీద చిన్న టీ దుకాణం నడుపుతుంటాడు. ఉప్పు పప్పులు, చిరుతిళ్ళు, సాఫ్ట్ డ్రింక్స్, టాఫీలు అమ్ముతాడు. ఆ పేద పల్లెలో అతను డబ్బున్నవాడిగానే లెక్క. అయితే లోభి, అత్యాశ గలవాడు. పిల్లలకి సామాను అప్పిచ్చి వాళ్ళు డబ్బు చెల్లించేటప్పుడు అదనపు ఖర్చు కూడతాడు. వాళ్ళు దాన్ని చెల్లించలేకపోతే, వాళ్ళ దగ్గరున్న విలువైన సామానేదో లాక్కొని తనైనా ఉపయోగించుకుంటాడు లేకపోతే దుకాణంలోనైనా అమ్ముకుంటాడు.

అతను బిన్యా గొడుగును చూసినప్పుడు, ఎట్టి పరిస్థితిలోనైనా దాన్ని స్వంతం చేసుకోవాలనే దురాశ అతనిలో తలెత్తుతుంది. 'ఈ తళుకు బెళుకుల గొడుగు చిన్నపిల్లలు వాడకూడదమ్మా. నాకు ఇచ్చేయి.' అని బిన్నీకి నచ్చచెప్పడానికి ప్రయత్నించినప్పుడు, 'ఇది అమ్మకానికి కాదు.' అంటూ బిన్యా తోసిపుచ్చేస్తుంది.

చుట్టుపక్కలున్న గ్రామంనుండి రాజారామ్ అనే ఒక పిల్లాడిని పనిలో పెట్టుకుంటాడు రామ్ భరోసా. బిన్యా ముళ్ళపందుల యీకలు సేకరించడానికి అడివికి వెళ్ళినప్పుడు– పిల్లాడు దాన్ని దొంగిలించి, దాన్ని రామ్ భరోసాకిస్తాడు. అయితే, బిజ్జూ రాజారామ్‌ని నిలదీసినప్పుడు నిజం చెప్పేస్తాడు. పల్లెవాసులు–తమలో ఒకరైన వ్యక్తి, పేద పిల్ల వద్దున్న నీలపు గొడుగుని దొంగిలించాడన్న సంగతిని జీర్ణించుకోలేకపోతారు. రామ్ భరోసాను వెలి వేస్తారు. అతని దుకాణం నుండి కొనుగోళ్ళు ఆపేసినప్పుడు, రామ భరోసా జీవనాధారానికి పెద్ద దెబ్బ తగులుతుంది. 'నమ్మకస్థుడైన దొంగ' అని అతన్ని పిల్లలు ఏడిపించడం మొదలుపెడతారు.

అతని పరిస్థితి చూడలేకపోయిన బిన్యా, తన గొడుగును అందరిముందూ విర్రవీగుతూ ప్రదర్శించుకున్నందుకు, తన్ని తాను నిందించుకుంటుంది. అతనిలో లాలూచీ ప్రవేశపెట్టినది తనే అనుకుంటుంది. గొడుగుని రామ్ భరోసాకు బహుమతిగా ఇస్తుంది. రామ్ భరోసా తన పొరపాటు గుర్తించి, తన వద్ద ఉన్న ఎలుగుబంటి పంజా ఉన్న పతకాన్ని బిన్యాకి ఇస్తాడు. అది పులిపంజాకన్నా ఎక్కువ అదృష్టకరమైనదని పల్లెవాసుల నమ్మిక. ' చీకటి పడుతున్న కొండల సందుల్లోనుంచి నక్షత్రాల గురించి పాడుకుంటూ బిన్యా ఇంటిదారి పడుతుంది. చెట్లు, నిశ్శబ్దంగా ఆమె పాట వింటుంటాయి. కొండలు సంతోషపడతాయి. పల్లెవారు, తిరిగి రామ్ భరోసా దుకాణానికి రావడం ప్రారంభిస్తారు.

★★★

అందమైన గడ్వాల్ కొండల నేపథ్యం ఉన్న కథ– పల్లె జీవితాలను, పల్లెవాసుల నమ్మకాలను, నిజాయితీని చక్కగా వర్ణిస్తుంది. ఇవ్వడంలోనే ఎక్కువ సంతోషం ఉందని చెప్తూ, శౌర్యం, విముక్తి, నిష్కృతి గురించి మాట్లాడే చిన్న కథ– పిల్లలకోసమే రాసినప్పటికీ పెద్దలకీ నచ్చుతుంది. సరళమైన శైలిలో ఉన్న పుస్తకం, మానవత్వానికి ముఖ్య భాగం అయిన 'దయ' అన్న అంశాన్ని ఒత్తి చెప్తుంది. ఏదీ బోధించే ప్రయత్నం చేయదు.
రూపా పబ్లికేషన్స్ 1980లో పబ్లిష్ చేసిన యీ నవలికని అమర్ చిత్ర కథా పబ్లికేషన్స్, 2012లో కామిక్‌గా మలిచింది. దీని ఆధారంగా, ఇదే పేరుతో విశాల్ భరద్వాజ్ 2005లో సినిమా తీశారు. సినిమాకి, 'నేషనల్ అవార్డ్ ఫర్ బెస్ట్ చిల్డ్రన్స్ ఫిల్మ్' పురస్కారం అందింది. సినిమా ఇక్కడ చూసే వీలుంది:
https://www.netflix.com/title/70075775 **

COMMENTS